# సూక్తిగా మిగిలిన వ్యక్తి

నింగి నేల చుర్రు మంటున్నాయి.

కాళ్ళకి నోళ్ళకి పిట్టలు పులుగులు తాళాలు బిగించుకున్నాయి. మర్రిచెట్టు ఆకులు మూగనోముపట్టాయి. పెళ్ళివారి యింటిని తలపించే ఆ వీధికి ప్రేతకళ వచ్చినట్టనిపించింది. బక్కచిక్కిన చెప్పులూ తూట్లు పడ్డ గొడుగులూ సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనడం వల్ల, జీవనసమరంలో ఇరుక్కున్న నిరుపేదలు కూడా నల్లపూసలయ్యారు. మర్రిచెట్టు గొడుగుకింద కాలక్షేపం చేసే ఆ వృద్ధుడు కూడా ఆ రోజు కనిపించలేదు. అయితే ఆయన కుట్టే పాతచెప్పులు, పాలిష్ చేసిన బూట్లు, రంగు మాసిపోయిన పాలిష్ పెట్టెలు...చిందర వందరగా పడివున్నాయి.

అత్తవారింటికి ప్రయాణమైన కూతురుని రైలెక్కించి యింటికి తిరుగుముఖం పట్టిన గురుమూర్తి నాలుగడుగులు ముందుకు వేసి మళ్ళీ స్టేషన్ ఆవరణలోనికి వచ్చాడు. కత్తులబోను లాంటి యిల్లు, దీర్ఘవ్యాధితో మంచమెక్కిన ఇల్లాలు గుర్తుకొచ్చేసరికి మండుతున్న నింగినేలలు ఆయనకు గుండెదడ కలిగించ లేదు. నడక సాగించి బస్సు స్టాపింగు చేరుకున్నాడు. ముక్కుతూ మూలుగుతూ వచ్చిన మనువు మాంధాతల నాటి బస్సెక్కి తాను చేరవలసిన ఆ వీధిని చేరుకున్నాడు. ఆ వీధిని దాటితే స్వగృహం వస్తుంది.

నీడను వెతుక్కుంటూ గురుమూర్తి నడుస్తున్నాడు. ప్రహరీగోడను దాటి, ఎత్తు పళ్ళులా వీధిలోకి వాలిన పూలమొక్కల కొమ్మల్ని చూసేసరికి ఆయనకి ప్రాణం లేచి వచ్చినట్లనిపించింది. ఆ నీడను చేరుకున్నాడు. రెండు మూడు నిముషాలు గడిచాయి. దాహం విపరీతంగా వేసింది. గేటు తెరిచి యింటివాళ్ళని మంచి నీళ్ళడగాలనుకున్నాడు. నాలుక పిడచకట్టుకుపోతోంది. గేటు తెరవాలనుకుంటుంటే, వీధి తలుపు తెరిచిన సవ్వడి అయింది.

గునుమూర్తికి ఆశ కలిగింది. తాగడానికి మంచినీళ్ళు కావాలని సైగ చేశాడు.

'రండి లోపలికి రండి ... ఎండ మండిపోతోంది.

పిలుపు వినిపించడం తరువాయి లోపలికి వెళ్లి కూర్చున్నాడు. ఎంత చల్లగా వుందని!

'ఫ్రిజ్‌నీళ్ళు తాగుతారుగా...' అంటూ యింటియజమాని రెండుగ్లాసులు టీపాయ్‌మీద వుంచాడు.

గురుమూర్తికి ఎంత దాహం వేసిందో కాని ఖాళీగ్లాసులే టీపాయ్‌మీద కనిపించాయి. పిడచగట్టుకుపోయిన నాలుక మామూలుస్థితికి వచ్చింది. దాంతో ఆయన మాటలపోగుగా మారిపోయాడు.

'ఈ యిల్లు మీ సొంతమేనా?'

'అద్దెయిల్లు'

'మీపేరు?'

'ఆనందరావని పిలుస్తారు'

'మీరేం చేస్తుంటారు?'

ప్రత్యుత్తరం వెంటనే రాలేదు.

అయన్ని పరీక్షగా చూసే అవకాశం కలిగింది గురుమూర్తికి. అలాగే ఆ హాలుని కూడా ఓరచూపులతో చూశాడు.

'రాయాలని బుద్ధిపుట్టినప్పుడు పత్రికలకి రాస్తూ వుంటాను...

'కథలా?'

'కాదు..సాంఘిక సమస్యల్ని గురించి...'

'అయితే మీరు ఫ్రీలాన్స్ జర్నలిస్టా...'

'అబ్బే.. అదేం కాదు. మీరనుకున్నట్టుగా నేను జర్నలిస్టుని కాదు.'

'మరేం చేస్తుంటారు?'

'చెపితే గాని విడిచిపెట్టేలా లేరు.. లా చదివాను. న్యాయం వున్నదనిపిస్తేనే, కేసు పుచ్చుకుంటాను. పెద్దలిచ్చిన ఆస్తి కొంచెం వుంది..'

'చాలా సంతోషమండి. సెలవిప్పిస్తారా?' అంటూ లేచాడు గురుమూర్తి.

'ఎండ యింకా నిప్పులు చెరుగుతోంది. కొంచెంసేపు కూర్చుని వెళ్ళచ్చుగదా..'

'అవుననుకోండి.. మరోసారి తీరిగ్గా వచ్చి మీరు వెళ్ళమనేంత వరకూ కూర్చుంటాను.'

'కాఫీ తీసుకు వెడుదురుగాని.. కూర్చోండి. మీరు మా యింటికి రావడం మొదటిసారి...'

ఆనందరావు మంచితనం గురుమూర్తిని కూర్చోబెట్టింది. చాలాకాలంగా పరిచయం వున్నవాడిలా ఆయన ప్రవర్తించడం చూసి సంతోషిస్తూనే ఆశ్చర్యపోయాడు.

ఆనందరావే కాఫీగ్లాసు తీసుకువచ్చాడు. 'తీసుకోండి'.

'ఇంట్లో మీవాళ్ళు...'

'ఆమె పుట్టింటికివెళ్ళి మూడురోజులయింది.

'మీరు నాకోసం చాలా కష్టపడుతున్నారు.'

'అబ్బే యిందులో కష్టమేముందండి! నాకోసం ఎలాగూ కాఫీ పెట్టుకోవాలి...'

'మీ చేత్తో యిందాక చల్లని మంచినీళ్ళు తాగాను. ఇప్పుడు మీ స్వహస్తాలతో తయారు చేసిన కాఫీ...'

'అయితే యీ ఆదివారం నలపాకం రుచి చూద్దురుగాని...'

ఆనందరావెవరో... తానెవరో! ఏమిటీ అనుబంధం! ఆశ్చర్యపోయాడు గురుమూర్తి. బంధువుల్లో కూడా యిలా మర్యాద చూపే వాళ్ళెందరున్నారు? గేటు దాకా వచ్చి ఆనందరావు ఆయన్ని సాగనంపాడు.

ఇంటికి వెళ్ళిన తర్వాత కూడా ఆయన్ని గురించే ఆలోచించసాగాడు. రోజులు గడిచేకొద్దీ వాళ్ళద్దరిమధ్య ఆదరాభిమానాలు అగ్గల మయ్యాయి. ఒక్కరోజు కూడా ఒకరినొకరు చూచుకోకుండా వుండలేక పోయారు. రాకపోకలు ఎక్కువయ్యాయి.

'గురుమూర్తిగారు, ఆనందరావు మీకు బంధువా?' గురుమూర్తి పొరుగింటి ముసలాయన ప్రశ్న యిది.

'ఏం, అలా అడుగుతున్నారు?'

'మరేం లేదు.. దగ్గరి బంధువుల్లా కనిపిస్తేను...'

'బంధుత్వాన్ని మించిన స్నేహం, అభిమానం మాది..'

'స్నేహితులన్నమాట! 'అతి' పనికిరాదని పెద్దలు చెపుతారు.'

'అంటే, ఆయనతో స్నేహం మంచిది కాదనా మీ ఉద్దేశం!' గురుమూర్తి ఆశ్చర్యపోతూ అడిగాడు.

'అనుభవజ్ఞులైన పెద్దల అభిప్రాయాన్ని చెప్పాను. అంతే...'

ఆ తరువాత మూడు నాలుగు నిముషాలు మౌనం అలుపుకుంది.

పొరుగింటి ముసలాయన ఎవరికీ తెలియని రహస్యం బయటపట్టేవానిలా అన్నాడు. 'మీకు తెలుసో తెలీదో... అయన పరమ నాస్తికుడండి.'

'అయితే నాకే.. అది ఆయన స్వవిషయం.....

గురుమూర్తి సమాధానం ముసలాయన్ని ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. ఆశ్చర్యంలోంచి ఆయన తేరుకోకముందే గురుమూర్తి మాట వినిపించింది.

'ఆనందరావుగారు చాలా మంచివారండి. ఆయన మంచితనం నన్ను వశం చేసుకుంది. మంచి మర్యాద తెలిసినవాడు. ... విద్యా వినయ సంపన్నుడు..'

'అయితే చెట్టుకింది ప్లీడర్లంతా విద్యా సంపన్నులే...'

గురుమూర్తి మనస్సు చివుక్కుమంది.

'ఆయన్ని మీరు తప్పుగా అర్థం చేసుకున్నారు. ఆయనకి తెలిసినన్ని విషయాలు నాకు తెలియవు. కాలేజీలో మేను చరిత్రపాఠం చెపుతున్నా, ఆనందరావుగారికి ప్రపంచచరిత్ర తెలిసింతగా నాకు తెలీదు. ఒక్క న్యాయశాస్త్రంలోనే కాదు, చరిత్ర, సాహిత్యం మొదలైన వాటిలో కూడా ఆయనకి అభినివేశం వుంది. చివరికి వేదాంతం కూడా పరిచితమైన విషయమే.....,

చినుకులుగా మొదలయింది జడివానగా పర్యవసించినట్టుగా వాళ్ళిద్దరి మాటలు ఆవేశ ప్రధానంగా ముగిశాయి.

ముసలాయన వెటకారంగా అన్నాడు. 'మెట్ట వేదాంతమా?'

'ఎందుకో మీరనవసరంగా ఆయన్ని పరిహసిస్తున్నారు. అప్పుడప్పుడు ఆయన భగవద్గీత, ఉపనిషత్తుల్లోంచి కోట్ చేస్తూ వుంటారు. ఆయన మాటల్లో....

'ఈ రోజుల్లో అలా కోట్ చెయ్యడం ఒక ఫ్యాషనైపోయింది. ఆ చిలకపలుకులు విని మీరు మోసపోయినట్టున్నారు.,

గురువమూర్తి సహించలేకపోయాడు. ఆనందరావు నాస్తికుడని అనుకోవడం వల్ల కాబోలు ఆయనంటే ముసలాయనికి ద్వేషభావం కలిగి వుండనచ్చునని గురుమూర్తి అనుకున్నాడు.

అప్పుడు లోపల్నించి వచ్చిన ఎదురింటి బామ్మగారు కంగారు పడుతూ, 'తొరగా డాక్టర్‌గారిని పిలుచుకురా బాబూ...,' అంది.

నిలుచున్నపళంగా గురువమూర్తి బయలుదేరాడు. ముసలాయన యింట్లోకి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి గురుమూర్తి నిద్ర పోలేదు.

బామ్మగారు తప్ప మరెవ్వరూ లేరు యింట్లో, రెండు మూడుసార్లు డాక్టరు వచ్చి చూసి వెళ్లాడు. ఇంట్లో దీపాలు వెలగడం చూసి, ఏదో పనిమీద ఆ దారిని వెడుతున్న ఆనందరావు 'మూర్తిగారు, మూర్తిగారు' అని పిలిచాడు గేటువద్ద నిలబడి, మిత్రుణ్ణి చూడగానే గురువమూర్తి బావురుమన్నాడు. 'నా భార్య చావుబతుకుల్లో వుంది...'

ఆనందరావు గబగబ లోపలికి వెళ్లాడు. కళ్లుమూసి తెరుస్తున్న మిత్రుని భార్య ఆనందరావుని చూసీచూడగానే సైగలతో తన భర్తను గురించి ఏదో చెప్పింది. 'ఆయన నాకు అన్నగారు... లోటు కలక్కుండా చూసుకునే బాధ్యత నాది...' అన్నాడు ఆనందరావు ఆమెను ఓదారుస్తూ.

మిత్రుని కొడుకు కూతురు, దగ్గరి బంధువుల చిరునామాలు తీసుకుని ఆనందరావు పెద్ద పోస్టాఫీసుకి బయలుదేరాడు. వాళ్లకి టెలిగ్రాములిచ్చేందుకు. అది ముగించుకుని తిరిగి వచ్చేసరికి మిత్రుని భార్య ఈ లోకం నుంచి నిష్క్రమించి కొన్ని నిమిషాలు అయివుంటుంది.

గురుమూర్తి శవానికి దగ్గరగా కూర్చున్నాడు, వెర్రిగా చూస్తూ మిత్రుని రాకను కూడా గమనించినట్టు లేదు.

దేనితోనూ నిమిత్తం లేకుండా కాలం తన పని సక్రమంగా చేసుకు పోతోంది.

మూగవోయిన ఆ యింటికి బామ్మగారి కంఠస్వరం ప్రాణం పోసింది.

'బాబూ, నిన్ను చూస్తుంటే గురుమూర్తికి తమ్ముడిలా కనిపిస్తున్నావు.. తెల్లారితే జరగాల్సిన పనేమిటో ఆలోచించు నాయనా...'

'అదే నేనూ ఆలోచిస్తున్నా బామ్మగారూ...'

'ఇంటి దీపం ఆరిపోయింది ఆనందరావుగారూ...'

'ఇటువంటప్పుడే గుండె నిబ్బరం కావాలి...' మిత్రుని వీపు నిమురుతూ ఓదార్చాడు ఆనందరావు.

భార్య మరణించిన దుఃఖంతో కుప్పలా గురుమూర్తి కూలిపోయాడు. బామ్మగారి సలహాల ప్రకారం ఆనందరావు తరువాతి కార్యక్రమం చూడసాగాడు. తెల్లవారుతున్నకొద్దీ గురుమూర్తి దగ్గరి బంధువులు మిత్రులు రావడం మొదలుపెట్టారు. కాలికి బలపర కట్టుకుని తిరుగుతున్న ఆనంద రావుని చూసి వాళ్లు ఆశ్చర్యపోయారు. 'ఎవరీయన.. ఎప్పుడూ చూడలేదే..' అని కొందరనుకున్నారు. 'గురువమూర్తికి వేలువిడిచిన తమ్ముడట...' అనుకొని కొందరు తృప్తిపడ్డారు.

అంత్యక్రియలు ముగిశాయి. వచ్చిన బంధువులు ఎవరి యిళ్లకు వారు వెళ్లారు.

గురుమూర్తి మళ్లీ లోకంలో పడ్డాడు. మిత్రుని పట్ల మునుపు ఆదర భావం వుండేది. ఇప్పుడది ప్రేమపూర్వక గౌరవంగా మారింది.

'ఆనందరావుగారు, మీరు నా కోసం చాలా కష్టపడ్డారు. ముందు వెనకలు చూడకుండా డబ్బు కూడా ఖర్చు పెట్టారు. మీరు చూపిన అభిమానాన్నే నెలాగూ తీర్చలేను. కనీసం మీరు ఖర్చు చేసిన డబ్బునైనా తీర్చాలని నా కోరిక. కోరికను చెల్లిస్తారు కదూ.'

గురుమూర్తి మాటలు విని ఆనందరావు నవ్వి ఊరుకున్నాడు.

'మీరలా నవ్వి ఊరుకుంటే నాకు నచ్చదు...'

'అయితే యేం చెప్పమంటారు?'

'ఎంతయిందో చెపితే సంతోషిస్తాను.'

'ఖర్చుచేసే స్తోమత వుంది కనక, కష్టంలో వున్న సాటి మనిషికి– అందులోను మిత్రరత్నానికి– సహాయం చెయ్యాలనిపించింది. అది ధర్మంగా భావించాను...'

'మీరు మీ ధర్మం నిర్వర్తించారు. నేను నా ధర్మం నిర్వర్తించాలి...' అంటూ ఆనందరావు చేతిలో ఒక కవరు వుంచాడు.

'ఏడు వందలు ఎక్కువగా యిచ్చారు..' లెక్కబెడుతూ అన్నాడు.

అది తిరిగి యివ్వబోతుంటే, 'డబ్బుతో తీర్చలేని సహాయం చేశారు మీరు... మీ చిరంజీవుల కేమన్నా కొని యివ్వండి....' గురుమూర్తి తీసుకోలేదు.

'ఒక చిన్న సవరణతో మీ మాటని ఒప్పుకుంటున్నా. మీరిచ్చిన ఈ మొత్తం విడిగా వుంచుతాను. ఎవ రికైనా అవసరం వచ్చినప్పుడు ఉపయోగపడుతుంది.'

మిత్రుని ఔదార్యం, పరోపకార బుద్ధి ఆయన్ని తల వంచేలా చేశాయి. మానవత్వం గల మనిషి ఆనందరావని లోలోపల అనుకుని మురిసిపోయాడు.

ఆ తర్వాత గీతాచార్యుని మొదలుకొని కార్ల్‌మార్క్స దాకా ఎన్నో విషయాలు వాళ్ల మాటల్లో దొర్లాయి. ఆలోచన తప్ప ఆవేశం ఎక్కడా కనపించలేదు.

'తీసుకోండి..' అంటూ ఆనందరావు భార్య కొబ్బరినీళ్ల గ్లాసులు రెండు టీపాయ్‌మీద వుంచింది. ఒక కుర్చీ దగ్గరికి లాక్కుని ఆమె భర్త వద్ద కూర్చుంది.

'సిద్ధాంతాలు ఎంత అవసరమో చేతలు కూడా అంతకంటే అవసరం.....'

'మీరు కార్యశూరులని బాగా తెలుసు. ఆ శూరత్వాన్ని కొబ్బరినీళ్లమీద చూపండి.. రెండు గంటలుగా మాట్లాడుతూనే వున్నారు....' అంది ఆనందరావు భార్య గ్లాసు అందిస్తూ.

'భర్తను గురించి భార్య యిచ్చేదే నిజమైన సర్టిఫికెట్టు....' అంటూ గురుమూర్తి కొబ్బరినీళ్లు గడగడ తాగేసి మిత్రుని వంక చూశాడు.

మిత్రుడు అదోలా కనిపించాడు. తాగలేక పోతున్నాడు. భార్యవైపు తూలుతున్నాడు.

'ఆనందరావు గారూ, వంట్లో బాగాలేదా...' 'నొప్పి.. నొప్పి..' అంటూ ఆనందరావు గుండె పట్టుకున్నాడు.

వీధి కొసను వున్న డాక్టరుగారిని తీసుకు రావాలని గురుమూర్తి ఆదుర్దాగా లేచాడు.

ఆనందరావుకి చెమటలు పడుతున్నాయి. ఫాను వేగం ఎక్కువ చేసింది భార్య. 'ఏమండీ..., ఏమండీ...'

భర్తనుంచి సమాధానం రాలేదు. ఆమె కళ్లు నీటిబుంగలైనాయి. తనవైపు తూలిన భర్తను గట్టిగా పట్టుకుంది.

డాక్టరుగారు వచ్చారు. పరీక్షించారు. ఆయన మౌనం వహించడంతో, 'చెప్పండి డాక్టరుగారూ... ఫర్వాలేదుగా..' అన్నాడు గురుమూర్తి వస్తున్న శోకాన్ని దిగమింగుతూ.

'హంస లేచిపోయి...' డాక్టరు నోటివెంట రాలేక రాలేక మాటలు వెలువడ్డాయి.

కింద పరుపు వేసి ఆనందరావుని పడుకోబెట్టారు.

మరణ వార్త కార్చిచ్చులా అప్పుడే దశదిశలకూ పాకిపోతోంది. వచ్చినవారు వస్తున్నారు. రోదన ధ్వనులు వినవస్తున్నాయి. కలకలలాడుతున్న యింట్లో కళాకాంతులు మాయమైనాయి.

ఎన్నడూ ఆనందరావు స్టడీరూంలోకి వెళ్లని గురుమూర్తి ఆనాడు వెళ్లాడు. టేబులు మీద డయరీ తెరచివుంది. పెన్ను పక్కనే వుంది. ముగ్గులు మూటకట్టే అక్షరాలలో...

ఉపకారం చేసినా ఫలం కోరకు... ఆ పైన చదవలేకపోయాడు గురుమూర్తి. ఆ సూక్తి ప్రతిధ్వనిస్తోంది.